మార్పు కోసం...
# మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను
హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను
మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 216 27 శనివారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

## తలపాగాలో మళ్లీ మెరిసిన ప్రధాని మోదీ..

### 2015 నుంచి ఇప్పటి వరకు ఏ స్టయిల్ తలపాగా ధరించారో తెలుసా..?

**జనవరి26(మరో ఉదయం)**

భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రధాని నరేంద్ర మోదీ తలపాగాలో మెరిశారు. ప్రధాని బాధ్యతలు స్వీకరించిన అనంతరం నుంచి రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే దినోత్సవాల్లో వేడుకల్లో తలపాగా కట్టుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. 2015 జనవరి 26 నుంచి ప్రతి సంవత్సంవరం ఒక్కో ప్రత్యేక కలిగిన తలపాగా ధరిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా ప్రధాని కాషాయరంగు 'బంధాని' తలపాగా ధరించారు.

2015లో ప్రధాని నరేంద్ర మోదీ వివిధ రంగుల్లో ఉన్న తలపాగాను తరలించారు. ముదురు ఆకుపచ్చ, కాషాయం, గులాబీ రంగుల్లో ఉండగా.. తెల్లని చుక్కలున్నాయి. తలపాగాతో నల్లటి సూట్‌ను ధరించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాతో కలిసి 66 గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

2016లో ప్రధానమంత్రి మోదీ ఎరుపు చారలతో పసుపు రంగులోని తలపాగా ధరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డార్క్ క్రీమ్ కలర్ ఫుల్ స్లీవ్ బంద్‌గాలా సూట్‌ను ధరించారు.

2017లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గులాబీ రంగు తలపాగా ధరించారు. ఈ సఫాపై వెండి రంగు క్రాస్ లైన్‌లు ఉన్నాయి. తెల్లటి కుర్తా, దానిపై తెల్లటి చుక్క ఉన్న నల్లటి జాకెట్‌పై మెరిసిపోయారు.

2018లో ప్రధాని మోదీ మల్టికలర్‌లోని తలపాగా ధరించారు. సఫాతో ప్రధాని మోదీ క్రీమ్ కుర్తా, నలుపు రంగు జాకెట్ ధరించారు.

2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట జెండా ఎగురవేసి ప్రసంగించారు. ఆ సమయంలో ఆయన బహులవర్ణాల్లోని తలపాగా ధరించారు. ఎరుపు, పసుపు రంగులో ఉన్న తలపాగా ధరించారు.

2020లో ప్రధానమంత్రి కాషాయ రంగు 'బంధేజ్' తలపాగాను ధరించారు. సాంప్రదాయ కుర్తా పైజామా, దానిపై జాకెట్ ధరించారు. మెమోరియల్ వద్ద అమరవీరులైన సైనికులకు ప్రధాని నివాళు లర్పించారు. 2021లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ప్రత్యేక తలపాగాలో కనిపించారు. ఎరుపు రంగు 'హలారీ తలపాగా'ను ధరించారు. ఈ తలపాగాను జామ్‌నగర్ రాజకుటుంబం ప్రధాని మోదీకి బహుమతిగా ఇచ్చింది.







2022 గణతంత్ర వేడుకల్లో ప్రధాని తలపాగాకు బదులుగా టోపీ ధరించి కనిపించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన బ్రహ్మకమల్ క్యాప్ ధరించారు. బ్రహ్మకమల్ ఉత్తరాఖండ్ రాష్ట్ర పుష్పం.

2023లో ప్రధానమంత్రి రంగురంగుల రాజస్థానీ తలపాగా ధరించి కనిపించారు. తెల్లటి కుర్తా, ప్యాంట్‌తో నల్లటి కోటు ధరించిన ప్రధాని మోదీ తెల్లటి స్టోల్ ధరించారు.

## కరీంనగర్ నుంచి లోక్ సభ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నాం

### ఎల్లుండి అమిత్ షా వస్తున్నారన్న సంజయ్
### కరీంనగర్ లో కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారని వెల్లడి
### నియోజకవర్గంలో 20 రోజులు యాత్ర చేస్తానన్న సంజయ్

**జనవరి26(మరో ఉదయం)**



లోక్ సభ ఎన్నికల శంఖారావాన్ని కరీంనగర్ నుంచి పూరించబోతున్నామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తెలిపారు. ఈ నెల 28న కరీంనగర్ లోని ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్ లో 10 నుంచి 20 వేల మంది బీజేపీ కార్యకర్తలతో సమ్మేళనం నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొంటారని తెలిపారు. ఎల్లుండి తెలంగాణకు అమిత్ షా వస్తున్నారని... మూడు క్లస్టర్ మీటింగుల్లో ఆయన పాల్గొంటారని సంజయ్ చెప్పారు. వీటితో పాటు చారిత్రక కట్టడాలను సందర్శిస్తారని తెలిపారు. 28న ఉదయం పాలమూరులో క్లస్టర్ మీటింగ్ లో పాల్గొంటారని.. మధ్యాహ్నం ఒంటి గంటకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారని చెప్పారు. ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తామని తెలిపారు. కరీంనగర్ లోక్ సభ స్థానంలో గెలుపు కోసం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నామని సంజయ్ చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పాదయాత్ర చేస్తానని... సమయం తక్కువగా ఉండటం వల్ల ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేటప్పుడు వాహనంలో వెళ్తానని చెప్పారు. 20 రోజుల పాటు తన యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలను ఇంటింటికీ వివరిస్తానని చెప్పారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి

### ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలేదన్న ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత
### ప్రైవేటు ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేస్తున్న ప్రభుత్వం
### ప్రభుత్వ నిర్లక్ష్యానికి అమాయకులను బలిపశువులుగా మార్చొద్దన్న లోకేశ్

**జనవరి26(మరో ఉదయం)**



ఏపీ ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలేదంటూ రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. దాంతో వైసీపీ ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. పలు ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేసింది. ఈ పరిస్థితులపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయని అన్నారు. అస్తవ్యస్త పాలనతో జగన్ ఖజానా ఖాళీ చేశారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ.1200 కోట్లు బకాయిలు పెట్టారని లోకేశ్ ఆరోపించారు. ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతతో పేదల వైద్యం గాలిలో దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం చొరవ చూపడంలేదని విమర్శించారు.వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే, ఆసుపత్రులను డీలిస్ట్ చేస్తూ ప్రభుత్వమే బెదిరింపులకు దిగడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి అమాయకులను బలిపశు వులుగా మార్చొద్దని నారా లోకేశ్ హితవు పలికారు. సామరస్య పూర్వకంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నేనూ త్వరలో ప్రజల్లోకి వస్తున్నాను



### ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం
### క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలంగా ఉంది.. ఎవరితోనూ సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదామని వ్యాఖ్య
### విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచన

**జనవరి26(మరో ఉదయం)**

తాను త్వరలో ప్రజల్లోకి వస్తానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. శు క్రవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని... ఎవరితోనూ సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదామని సూచించారు. త్వరలో నేను కూడా ప్రజల్లోకి వస్తున్నానన్నారు. తెలంగాణ ప్రజల ఆశలన్నీ బీఆర్ఎస్ ఎంపీల పైనే ఉన్నాయన్నారు. అధికారంలో లేకపోయినా రాష్ట్రం కోసం పని చేసేది మనం మాత్రమే అన్నారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గళం బలంగా వినిపించాలని సూచించారు.రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడాలని సూచించారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. ఆపరేషన్ మ్యానువల్, ప్రోటోకాల్ లేకుండా ప్రాజెక్టులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు.పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం కె.కేశవరావు మాట్లాడుతూ... విభజన చట్టంలోని హామీలపై పార్లమెంట్‌లో మాట్లాడుతామని తేల్చి చెప్పారు. కృష్ణా బోర్డు ప్రాజెక్టుల అప్పగింత అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతామన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. తెలంగాణ గళం, బలం, దళం బీఆర్ఎస్ మాత్రమే అన్నారు.

## సీఎం జగన్ బీజేపీకి బానిసలా మారిపోయారు

### గుంటూరులో షర్మిల తీవ్ర వ్యాఖ్యలు
### గుంటూరులో కాంగ్రెస్ నేతల సమావేశం
### ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ షర్మిల
### రాష్ట్రంలో మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని వెల్లడి
### మణిపూర్ లో క్రైస్తవులపై దాడి జరుగుతున్నా జగన్ స్పందించడంలేదని విమర్శలు

**జనవరి26(మరో ఉదయం)**



గుంటూరులోని మెట్టు అంజిరెడ్డి కల్యాణ మండపంలో నేడు కాంగ్రెస్ నేతలు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఏపీలో మైనారిటీలకు కష్టకాలం నడుస్తోందని, రాష్ట్రంలో మైనారిటీలకు రక్షణలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. మణిపూర్ లో క్రైస్తవులపై దాడి జరుగుతున్నా ఏపీ సీఎం జగన్ స్పందించలేదని షర్మిల విమర్శించారు. సీఎం జగన్ బీజేపీకి బానిసలా మారిపోయారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినప్పటికీ, బీజేపీకి వైసీపీ ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలకే సీఎం జగన్ అపాయింట్ మెంట్ ఇవ్వడంలేదని అన్నారు. సీఎం జగన్ పెద్ద పెద్ద గోడలు కట్టుకుని కోట లోపల ఉన్నారని షర్మిల ఘాటు విమర్శలు చేశారు. ఈ ఐదేళ్లలో ఒక్కసారైనా జాబ్ క్యాలెండర్ ఇచ్చారా? అని షర్మిల నిలదీశారు. ఎన్నికల వేళ జాబ్ నోటిఫికేషన్ ఇస్తే ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. గుంటూరు నగరం గుంత లూరుగా మారి పోయిందని వ్యంగ్యం ప్రదర్శించారు. జీతాలు ఇచ్చేందుకే డబ్బులు లేవు... అభివృద్ధికి ఎక్కడ్నించి వస్తాయి? అని ఎత్తిపొడిచారు. రాష్ట్రంలో ప్రతి గడపకు వస్తానని, వీలైనంత మందిని కలుస్తానని షర్మిల వెల్లడించారు.

## నా అవార్డును దేశంలోని రైతులకు, మహిళలకు, యువతకు అంకితమిస్తున్నా

**న్యూఢిల్లీ:జనవరి26(మరో ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం తనకిచ్చిన అవార్డును దేశంలోని రైతులకు, మహిళలకు, యువతకు అంకితమిస్తున్నానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు చేశారు. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందని భావిస్తూ నవభారత నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. శక్తిమంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రజలతో కలిసి నడుస్తానని ప్రజలకు సవినయంగా తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. అదేవిధంగా దేశ ప్రజలందరికీ వెంకయ్యనాయుడు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తనతోపాటు పద్మవిభూషణ్ స్వీకరించిన సినీహీరో, మాజీ కేంద్రమంత్రి చిరంజీవికి కూడా ఆయన అభినందనలు చెప్పారు.



మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## ఉచిత పథకాలపై ప్రజలే నిలదీయాలి !

అధికారం కోసం పాలకులు ప్రజలను ఓటు బ్యాంకుగా చేసుకుని పథక రచన చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు అన్నట్లుగా పథకాలను రూపొందిస్తున్నారు. సంంక్షేమం అన్న ముసుగు తగిలించి దేశ, రాష్ట్ర ఖజానాలను గుల్ల చేస్తున్నారు. లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఇలాంటి దుబారా పథకాలను నిలువరించాలి. ప్రజలు కూడా నిలదీయాలి. తమ చేతిక ఇఎముక లేదన్నట్లుగా నగదు జమ చేస్తున్నారు. ఎపిలో అయితే బటన్ నొక్కుడు..నగదు జమచేయడం నిత్యకృత్యంగా మారింది. తెలంగాణలో కూడా గత ప్రభుత్వం దళితబంధు, రైతుబంధు వంటి పథకాలతో బొక్కసాన్ని కొల్లగొట్టింది. అధికారం పోయాక ఇప్పుడు అవే పథకాలు అమలు చేయాలంటూ ప్రజలను రెచ్చగొడుతోంది. ఇది అభివృద్ధి, సంక్షేమం ఎలా అవుతుందో చెప్పలేకపోతున్నారు. ఇలాంటి పథకాలపై ప్రజలే నిలదేసేలా చైతన్యవంతులు కావాలి. ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను ఇలా దుబారా చేయడంపై నిలదేసే రోజులు రావాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటుంటే..పాలకులు అధికారం కోరుకుంటున్నారు. ఎంతకు తెగించి అయినా అధికారం లోకి రావడమే లక్ష్యంగా అనేకానేక ఉచిత పథకాల హామీలను గుప్పిస్తున్నారు. ఆదాయ వ్యయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న విన్యాసాలతో దేశ,రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం మారిపోతోంది. అభివృద్ధి పడకేస్తోంది. నిరుద్యోగం పెరుగుతోంది. వస్తూత్పత్తి పడిపోతోంది. నిరంతరంగా ఏదో ఒక పథకం పేరుతో నగదు బదిలీలు జరుగుతున్నాయి. దీనికి కాంగ్రెస్, బిజెపిలతో పాటు ప్రాంతీయ పార్టీల నేతలంతా బరి తెగిస్తున్నారు. పేదరికం నుంచి ప్రజలను బయటపడేసే ఉద్దేశ్యంతో చేస్తున్న ఆర్భాటాలతో పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయి. 75 ఏళ్లు దాటినా ఇంకా పేదల పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇలా నగదు బదిలీ పథకాలతో బొక్కసం గుల్ల చేస్తున్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థితిలో ఉండడం లేదు. ఉపాధి, ఉద్యోగరంగాలను బలోపేతం చేసే చర్యలు చేయడం లేదు. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆదుకోవడం లేదు. ఉన్న పరిశ్రమాలను మూసేస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను తెగనమ్మే స్తున్నారు. దేశంలో ప్రజలు అన్నమో రామచంద్రా అంటున్నా పట్టించుకోవడం లేదు. రైతుబంధు, ఉచిత విద్యుత్, ఉపాధిహామీ, కిలోరూపాయి బియ్యంలాంటి పథకాలన్నీ దండగమారివే అయినా కొనసాగి స్తున్నారు. గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న వేళ మార్పునకు నాందీప్రస్తావన కావాలి. పేద ప్రజలకు తాము అధికారం లోకి వస్తే ఉచిత పథకాలతో లబ్దిచేకూరుస్తామని రాజకీయ పార్టీలు, నేతలు, ఎన్నికలవేళ చేస్తున్న వాగ్దానాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి. ఉచిత వాగ్దానాలు సాధారణ బడ్జెట్‌ను మించి ఉంటున్నా యని, ఇలాంటి జనాకర్షక హామీలు గుప్పించడం తీవ్రమైన అంశమని గుర్తించాలి. గతంలో సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి అభిప్రయామే వెలిబుచ్చింది. ఇకనుంచైనా ఉచిత వాగ్దానాల వర్షం కురిపించే రాజకీయ పక్షాలను, నేతలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో నిలదీయాలి. తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి ప్రభుత్వానికి అవకాశం లేదు. గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడడం ఎలా అన్నదే ప్రస్తుతం ఉన్న సమస్య. ఎన్నికలకు ముందు ప్రజానిధులతో ఉచిత తాయిలాలు ప్రకటిస్తూ, ఉచిత హామీలిస్తున్న పార్టీల ఎన్నికల గుర్తును స్తంభింపజేయాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అయినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. త్వరలో పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల ముందు మరోమారు ఈ సమస్య చర్చ కావాలి. ఉచితాలపై ప్రజలే నిలదీయాలి. మనకెందుకు లే

అని అనుకుంటే మనలను నిండా ముంచుతారు. అందుకు తెలంగాణలో కెసిఆర్ ఏలుబడే చక్కటి ఉదాహరణ. ఎపిలో జగన్ పాలన కూడా అందుకు ఉదాహరణెళి. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్న తీరును ప్రజలు చైతన్యవంతులయి ఎక్కడికక్కడ నిలదీయాలి. ఈ ఎన్నికల్లోపే ఇది చేయగలమా? వచ్చే ఎన్నికల వరకైనా చేయగలమా? అన్నది ఆలోచించాలి. ఉచిత హామీలకు అయ్యే ఖర్చు సాధారణ బడ్జెట్‌ను మించిపోతోందని గతంలో సుప్రీం సిజె గా పనిచేసిన జస్టిస్ ఎన్‌వి రమణ చేసిన వ్యాఖ్యలు మననం చేసుకోవాలి. ఓటర్ల నుంచి రాజకీయ లబ్ది పొందటం కోసం అనుసరిస్తున్న జనాకర్షణ విధానాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీనిపై నిషేధం విధించాల్సి ఉంటుందని కూడా అప్పట్లో ఆయన అభిప్రాయపడ్డారు. ఇది చాలా తీవ్రమైన సమస్య అంటూ...మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఎన్నికల సంఘానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం కూడా తనకుతాను నియమావళిని నిర్దేశించుకుని రాజకీయ పార్టీలను కట్టడి చేయాల్సి ఉంది. అధికారం కోసం... అధికార వనరులపై పెత్తనం కోసం రాజకీయ పార్టీలు చేస్తున్న విన్యాసాలే ఈ ఉచిత పథకాలుగా చెప్పుకోవాలి. ఎపిలో నిరంతరాయంగగా డబ్బుల పంపిణీ కార్యక్రమం మనకు కళ్లకు కనపడుతోంది. జగన్ తనతాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి నుంచి పంచి పెడుతున్నట్లుగా ఎపిలో బొక్కసం ఖాళీ చేస్తున్నారు. కెసిఆర్ కూడా అప్పులతో ఆస్తులు సృష్టించానని చెప్పి తెలంగాణను అప్పుల కుప్పగా తయారు చేశారు. ఈ అప్పులు తేర్చడానికి వేలకోట్లు వడ్డీలకే చెల్లించాల్సి రావడం దారుణం కాక మరొటి కాదు. ఇలాంటి నేతలను నమ్మితే మనలను మనం అంగట్లో అమ్ముకోవడం తప్ప మరొటి కాదు. అధికారంలోకి రావడానికి పథకాలు ప్రకటించడం.. అధికారం లోకి వచ్చాక దానిని నిలుపుకోవడానికి నగదు బదిలీ పథకాలు ప్రవేశ పెట్టడం బాగా అలవాటు చేసుకున్నారు. ప్రజలు చెమటోడ్చి పన్నులు కడితే అభివృద్ధి పనులతో సంపదను సృష్టించాల్సిన నేతలు సంపదనలు హారతి కర్పూరంలా హరించి వేస్తున్నారు. మోడితో సహా కెసిఆర్, జగన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి సిఎంలంతా ఇందుకు అతీతులు కాదు. ఏదో విధంగా అధికారాన్ని కాపాడు కోవాలన్న లక్ష్యంతో చేస్తున్న పథకాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారు. విద్య,వైద్యం అందకుండా పోతోంది. రవాణా మార్గాలు నేటికీ అభివృద్ధి జరగడం లేదు. ఎన్నికలు వచ్చినపుడల్లా కొత్తకొత్త ఉచిత పథకాలు వచ్చి చేరుతున్నాయి. ఖర్చుల భారం పెరగ డంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసేస్తున్నారు. అదేమంటే అభివృద్ధికి అప్పులు తప్పవంటున్నారు. దేశవ్యాప్తంగా నడుస్తున్న ఉచిత పథకాల వ్యాప్తిని చక్కదిద్దేందుకు చర్చించాలి. రాజకీయ పార్టీలను నిలదీయాలి. లేకుంటే వారు మనలను అప్పులకు బాధ్యులుగా చేయగల సమర్థులు.

## బీ ఆర్ ఎస్ నుండి సొంత గూటికి చేరిన చున్నాపాష..

మరో ఉదయం ప్రతినిధి, కుకట్పల్లి

బీ అర్ ఎస్ నాయకుడు చున్నుపాషా శుక్రవారం ఢిల్లీ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లు రవి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన చున్ను పాష ఇటీవల గత అసెంబ్లీ ఎన్నికల ముందు బిఆర్‌ఎస్ పార్టీ తీర్థపుచ్చుకున్నారు. పార్టీలో చేరిన నాటి నుండి ఆ పార్టీ వ్యవహారాల విషయంలో తనకు నచ్చకపోవడంతో తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చున్నా పాషా కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చూన్నా పాషా తో పాటు నర్సింహా, టింకు, గోపాల్, చైతన్య, వహీద్ లు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చున్నుపాష మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేయాలని పార్టీలో చేరానని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేందర్, తూము సంతోష్, సతీష్ గౌడ్, సచిన్, సుధాకర్ రెడ్డి, సునీల్, నరేష్, నహీం, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.



## కూకట్పల్లిలో జెండా ఆవిష్కరణ చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

మరో ఉదయం ప్రతినిధి,కూకట్పల్లి

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పలు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శివాజీనగర్ లో జాతీయ జెండాను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సునీల్, ప్రవీణ్, కళ్యాణ్, మహేందర్, విజయ్, రాజు, శ్రీధర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## దీనబంధుకాలనీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

మరో ఉదయం ప్రతినిధి కూకట్పల్లి

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా పౌరులు ముందుకు సాగాలని దీనబంధుకాలనీ సొసైటీ అధ్యక్షులు మాలోతు మహేందర్ నాయక్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సొసైటీ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి మహేందర్ నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌరులు బాధ్యతగా మెలుగుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ కోశాధికారి రాజు, వార్డు సభ్యులు ఎల్లం నాయుడు, వెంకటయ్య, కైలాష్, గిరి, మోహనరావు, శ్రావణ్, సుహాస్, యాదవ్, శ్రీనివాస్, వెంకట్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



## మూడు రంగుల జెండా ముచ్చటైన మన భారత జెండా.... కాంగ్రెస్ నేత బండి రమేష్

మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి

సమరయోధుల త్యాగఫలం నేటి గణతంత్ర దినోత్సవ సంబరం అని మూడు రంగుల జెండా ముచ్చటైన మన భారత జెండా అని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ పేర్కొన్నారు.75వ భారత గణతంత్ర దినోత్సవ సందర్భంగా కుకట్పల్లి నియోజకవర్గ వివిధ డివిజన్లలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు లు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ అల్లాపూర్ డివిజన్ కి చెందిన 100 మంది ముస్లిం కుటుంబాలకు చెందిన సోదరులు కాంగ్రెస్ పార్టీలో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సమక్షంలో జాయిన్ చేరారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి గారు,మరియు బి బ్లాక్ ప్రెసెంట్ తూము వేణు గారు, మరియు తూమ సంతోష్ గారు, మరియు వివిధ డివిజన్ ప్రెసిడెంట్స్ స్ రమేష్ గారు, ప్రవీణ్ గారు, నరసింహ యాదవ్ గారు, కృష్ణ రాజ్ పుత్ గారు, మధు గౌడ్ గారు, మల్లికార్జున యాదవ్ గారు, శివ చౌదరి, అరుణ్, రజిత, లక్ష్మి, అరవింద, రేణుక, పరమ లత, సంధ్య, అరుణ, వరలక్ష్మి తదితరులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



## దుబారా పథకాలపై సమీక్షలేవీ

### ఉచిత పథకాలతో వేలకోట్లు వృధా అప్పుల భారం పట్టించుకోని పాలకులు

హైదరాబాద్,జనవరి26(మరో ఉదయం)

ప్రత్యేక తెలంగాణ ఏర్పడక ముందు నీళ్లు..నిధులు..నియామకాలు అంటూ ఊదరగొట్టిన కెసిఆర్..తన పాలనా కాలంలోతెలంగాణలో ఈ మూడు లక్ష్యాలు నెరవేరాయని, బంగారు తెలంగాణ అయ్యిందని ప్రకటించుకున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక కానీ తెలియలేదు.. తెలంగాణను అప్పుల కుప్పగా చేశారని..తెలంగాణ అంతా బంగారుమయం అయ్యిందన్న భావనలో ప్రజల్లో భ్రమలు కల్పించారు. అడక్కుండానే కాళేశ్వరం కట్టి అది ప్రజలకోసమే అన్నారు. అలాగే ఉచిత విద్యుత్ దుబారాను అరికట్ట లేదు. రైతుబంధు ముసుగులో వేలకోట్ల దుర్వినియోగాన్ని ఆపలేదు. దళితబంధు పేరుతో వందలకోట్లు పంచిపెట్టేశారు. రూపాయికే కిలో బియ్యం పథకం దుబారాను ఏ ప్రభుత్వం కూడా అరికట్టడం లేదు. కాంగ్రెస్ కూడా దీనిని కదుపుతుందా లేదా అన్నది చూడాలి. రైతులు గిట్టుబాటు ధరలు కావాలన్నా..ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నా సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. అంటే పథకాలన్నీ ఓట్లను రాల్చేలా ప్రవేశ పెట్టడం నేర్చుకున్నారు. ధనిక రాష్ట్రం కాస్తా ఇప్పుడు అప్పుల ఊబిలో మునిగిందని తెలుసుకునే వరకు సమయం మించిపోయింది. ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పాలకులు మేల్కోవడం లేదు. ఇక్కడ కెసిఆర్, ఎపిలో జగన్ చేతికి ఎముక లేదన్న చందంగా అటుఇటుగా ఒకే తరహా పథకాలతో ప్రజల్లో దానకర్ణుడిలా పోజులు పెడుతున్నారు. ప్రత్యేక విమానాల్లో విహరించడం మొదలు అధికారం కోసం ప్రజల డబ్బును నీళ్ల ప్రాయంగగా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ది కోసమే దళితబంధు పథకాన్ని ప్రారంభిం చారు. దళితబంధు మాత్రమే కాదు.. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్తు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్లు, పంటరుణాల మాఫీ, రైతుబీమా.. కిలో రూపాయికే బియ్యం వంటివన్నీ ఉచిత పథకాలే. ఎన్నికల సందర్భాల్లోనో, ఇతర రాజకీయ పరిస్థితుల్లోనో ప్రజలను ఆకర్షించేందుకు కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అమలు చేస్తున్నవే. వీటిలో అనుత్పాదక ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇప్పటికే రాష్ట్ర అప్పులు దాదాపుగా మూడు ఆరు లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఉచిత పథకాల నిధుల భారంతో భారం తడిసి మోపెడు అవుతోంది. నగదు బదిలీలు అంతాఇంతా కాదు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలతో కొత్త కొత్త పథకాలు తెరమీదకు తెస్తోంది.



కేసీఆర్ రాక ముందు కూడా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయి. వాటికి కేసీఆర్ జోడించిన కొత్త పథకాల బరువు ఏటా రూ.45 వేల కోట్ల పైమాటేనని లెక్కలు చెబుతున్నాయి.. రైతులకు పెట్టుబడి సాయం చేయాలన్న ఉద్దేశంతో 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎకరానికి రూ.10 వేలు ఇచ్చారు. ఏడాదికి రూ.14 వేల కోట్లకు పైగానే ఖర్చవుతోంది. దీనికి ఎలాంటి పరిమితులు విధించకపోవడంతో వేలకోట్లు దుబారా అయ్యాయి. వందల ఎకరాలున్న ఆసాములు కూడా ఆర్థిక సాయానికి అర్హు లే అన్నట్లుగా పథకం సాగింది. పరిమితి విధించాలంటూ చాలాకాలం నుంచి డిమాండ్లు ఉన్నా పట్టించుకోలేదు. మంత్రి మల్లారెడ్డి కూడా తనకు 600 ఎకరాలున్నాయంటూ ప్రకటించారు. ఇలాంటి మోతుబరి కూడా రైతుబంధును మెక్కేశారు. రైతుబంధును ఎలాగైనా ముందుకు నడిపించే పట్టుదలలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర సబ్సిడీ పథకాలను కొండెక్కించి, రైతు బంధుకు మళ్లించారు. ఉచిత విద్యుత్ భారం ప్రభుత్వంపై పలు రెట్లు పెరిగింది. 10 బోర్లు ఉన్న పెద్ద రైతులకు కూడా ఉచి త విద్యుత్తు అందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్న ఉదయి స్తోంది. పేద యువతుల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి కింద ఏటా 3 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. దళితబంధు మరో ఉచిత నగదు పంపిణీ పథకంగా చూడాలి. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల నగదును పంపిణీ చేసారు. పథకాల కోసం చేస్తున్న అప్పులు, వడ్డీల సంగతి సరేసరి. దాంతో ఇతర పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులకు కటకట ఏర్పడింది. దీనికితోడు నిరుద్యోగ సమస్య వెన్నాడుతోంది. కిలో రూపాయి బియ్యం పథకం, రైతుబంధు తదితర పథకాలను తక్షణం సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకుంటే మరింత ఆర్థిక బారం తప్పేలా లేదు.

మరో ఉదయం

# అశ్వాపురం కేంద్రం గా సిండికేట్ దందా..



భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి : 26 మరో ఉదయం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మా షాపు మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తోంది పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మద్యం మాఫియా. మండలంలో మూడు షాపులకు ఆబ్కారీ శాఖ అనుమతివ్వగా ముగ్గురు వ్యాపారులు సిండికేట్‌గా మారి బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తూ ఊరూరా మినీ వైన్‌షాపులను ఓపెన్ చేశారు. ఎనీ టైం మందు లభించే విధంగా ఏర్పాట్లు చేసేసుకున్నారు. మద్యంషాపులకు ఒక రేటు.. బెల్ట్‌షాపులకు ఒక రేటు ఫిక్స్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. బెల్ట్‌షాపులు నడపాలంటే ముందుగా వైన్‌షాపులతో ఒప్పందం కుదర్చుకున్నాకే వ్యాపారం సాగించాలంటే.. లేదంటే అధికారులతో తనిఖీలు చేయిస్తానంటూ ఓ బినామీ వ్యాపారి మద్యం వ్యాపారంలో సిండి "కేటు" మాయాజాలంలో సాకేతపురి మార్క్ చూపిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. మన వ్యాపారానికి సహకరించుకుంటే మీ మీ బెల్ట్ దుకాణాలు ఉండవు అధికారులకు తెలిస్తే మీ సంగతి అంతే అంటూ బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఆ యజమాని హిత బోధన చేస్తున్నట్లు పలువురు గొలుసు కట్టు దుకాణదారులు మీడియా ముఖంగా ఆవేదన వెల్లడించారు. కాగా ఆయన కను సన్నల్లోనే మద్యం సిండికేట్ దందా సాగుతుండగా.. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం జి హుజూర్ అంటూ ఆయనకి వత్తాసు పలుకుతూ తనిఖీలు మరసి ఆ సిండికేట్ సాకేతపురి ఇచ్చే నెలవారి మామూళ్లకే అలవాటు పడి ఆయన కనుసన్నల్లోనే అధికారులు పనిచేస్తున్నట్లుగా స్పష్టం అవుతోంది. మండలంలో సాగుతున్న మద్యం సిండికేట్ వ్యాపారంపై పలు పత్రికలు వరుసగా కథనాలు ప్రచురించడమే కాకుండా అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అధికారులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా.. ఇప్పటి వరకు ఆ షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదంటే విధుల్లో వారి వైఖరి ఏంటో స్పష్టమవుతుంది.

## ఒప్పందం ఓపెన్ సీక్రెట్ :

మద్యం వ్యాపారులకు ఆబ్కారీ అధికారులకు అండర్ స్టాండింగ్ కుదిరిందనే ప్రచారంతో పాటు మండలంలో మద్యం వ్యాపారులకు బెల్ట్ షాపుల నిర్వ హాకు లకు లెక్క కుది రింది. మద్యం వ్యాపారం ఎలా చేసినా అడిగేందుకు అధి కారులు అడ్డురారని నేను చూసు కుంటానని మద్యం డాన్ పెద్దన్న అభయం ఇస్తున్నట్టు తెలు స్తుంది. తమకు అడ్డం లేనప్పుడు ఎవరేం చేస్తే ఏంటీ అనే విచ్చల విడితనంతో మండల ంలో మద్యం సిండికేట్ రెచ్చిపోతోంది. అధి కారులకు, వ్యాపా రులకు, బెల్ట్‌షాపు నిర్వా హాకులకు మధ్య మంచి డీల్ ఉందని మందు బాబులు సైతం పేర్కొం టున్నారు. మద్యం ప్రియుల అలవాటును, అవసరాన్ని ఆసరాగా చేసుకుని దోపిడీకి తెగ బడుతున్నారంటూ వాపోతున్నారు. కాస్లీ మద్యం వైన్‌షాపుల్లో దొరకకున్నా బెల్ట్ షాపుల్లో దొరుకుతుండటం గమనార్హం.

## మద్యం కల్తీ కూడా జరుగుతోందా..

మండలంలో మద్యం కల్తీ కూడా జరుగుతోందని కొంత మంది మందు బాబులు ఆరో పిస్తున్నారు. ఎక్కువ ధరలు కలిగిన మద్యం సీసాల్లో నీళ్లతోపాటు చీప్ లిక్కర్ మందును నింపుతూ కల్తీ దందా చేస్తున్నారంటూ పేర్కొంటుండటం గమనార్హం. లిక్కర్ కంపెనీల నుంచి నాణ్యతతో వస్తున్న స్కాచ్ బాటిళ్లు, అధిక ధరలు కలిగిన మద్యం సీసాలను కల్తీ చేస్తున్నారంటూ చెబుతుండటం గమనార్హం. ఈ సీసాల మూతలను ఒడుపుతో తొలగించి అందులో నుంచి కొంత మద్యాన్ని పక్కనబెట్టి ఆ స్థానంలో తక్కువ ధర ఉన్న చీప్ లిక్కర్‌ను మిక్స్ చేస్తున్నారంటూ చెబుతున్నారు. వాసన రాకుండా నీళ్లు కలుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## వైన్ షాపులకు అనుబంధంగా...

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం

అధిక

ప్రాధాన్యం ఇస్తుం డడంతో వైన్‌షాపుల

నిర్వాహకులు

ఇష్టా రీతిగా వ్యవ హరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నా యంటే అతి శయోక్తికాదు. తమ టార్గెట్లు చేరుకొనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ, అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించే లా వైన్ షాపుల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్‌పై 30 నుండి 50, బీరు బాటిల్స్ పై 50 నుండి 100 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా ప్రతి వాడలో కనీసం 10 వరకు బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి.

## గరీబోళ్ల కష్టాన్ని దోసుకుంటున్న రా బందు :





మామూళ్ల మత్తులో
ఆబ్కారీ శాఖ
రెచ్చిపోతున్న లిక్కర్ సిండికేట్
మాఫియా తనిఖీలు శూన్యం..
పట్టించుకోని అధికారులు
సిండి "కేటు" మాయాజాలంలో
సాకేత పురి మార్క్

పినపాక నియోజకవర్గంలో అశ్వాపురం మండలంతో పాటు గ్రామాలలో రాత్రి పగలు అనే తేడ లేకుండా జోరుగా బెల్ట్ దందాసాగుతోంది. రోజుకో దుకాణం పుట్ట గొడుగుల్ల వేలుస్తున్నాయి. అబ్కారిశాఖ అధికారు ల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటును ప్రోత్సహిస్తుంది. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు అధిక ధరలతో మద్యం ప్రియుల జేబులకు గుల్ల చేస్తున్నారు. బెల్ట్ షాపుల దందా 'మూడు బాటిళ్లు.. ఆరు కాసులు'గా తయారైంది. నివాస గృహాలతో మొదలు చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయానుసరం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. సామాన్యులు పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. సంపాదన మద్యానికి ఖర్చు చేస్తుండడంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మద్యానికి బానిసలైన కొందరు ఏ పని చేయకుండా ఉదయాన్నే బెల్టు షాపులకు చేరుకొని ఉద్దెర పెట్టి అప్పుల పాలవుతున్నారు. కాగా గరీబోళ్ల కష్టాన్ని సిండికేట్ పేరుతో ఓ రాబందు సొమ్ము చేసుకుంటున్నట్లు అనతి కాలంలోనే అయన ఖరీదైన భవనాలతో పాటు విలువైన కార్లను కూడా కలిగి ఉండి మందుబాబులపైనే సింధులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవానికి కల్పిస్తున్న భరోసాతో పాటు మద్యం ఆగడాలపై కూడా జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి దృష్టి కేంద్రీకరించాలని, పలు ప్రజాసంఘాల నాయకులలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# గ్రీన్ భద్రాద్రి వారితో విప్ప మొక్కలను నాటిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాద్రి జిల్లా బ్యూరో కర్నే బాబు జనవరి: 26 మరో ఉదయం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐ.టీ.డీ.ఏ. పీ.వో. ప్రతిక్ జైన్ చే గ్రీన్ భద్రాద్రి వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పి.ఓ. మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి వారు గత 13 సంవత్సరాల నుంచి విరివిగా మొక్కలు నాటడం చాలా ఆనందదాయకమని కానీ, మీరు భవిష్యత్తులో రాములవారికి ప్రసాదంగా భావించే విప్ప మొక్కలు నాటడం ద్వారా గిరిజనులకు దేవత వృక్షంగా భావించే విప్ప మొక్కలను నాటడం చాలా ఆనందదాయకమని, గ్రీన్ భద్రాద్రి వారు వెయ్యి విప్ప ముక్కలను నాటవలసిందిగా పిఓ కోరడమైనది. దీనికి మా వంతు సహాయ సహకారాలు ఎప్పుడు గ్రీన్ భద్రాద్రి వారికి ఉంటాయని వారు తెలియజేశారు. భవిష్యత్తులో మీరు విప్పమొక్కలను విరివిగా నాటాలని ఇదే విధంగా ప్రతి ఒక్కరూ విప్ప మొక్కలను నాటడం ద్వారా అవి పెద్ద వృక్షాలుగా మారి వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించడమే కాక, భవిష్యత్ తరానికి చక్కటి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించిన వారమవుతావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ డి.టి.డబ్ల్యు.ఓ. దేవిడ్ , రమణయ్య, గణేష్, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు, కార్యదర్శి శ్రీరంగం సంపత్, కోశాధికారి విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షులు జి.ఎస్ .శంకర్రావు, డాక్టర్ గోళ్ళ భూపతిరావు, బోణాల నాగ సూర్యనారాయణ, కామిశెట్టి కృష్ణార్జున రావు, ఉపాధ్యక్షులు పూసం రవికుమారి గంగాధర వీరయ్య, బండారు తిలక్ , న్యాయ సలహాదారు పామరాజు తిరుమలరావు, ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి

## 2030 నాటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తి చేస్తాం

## విద్యుత్తు రంగాన్ని రూ. 81 వేల కోట్ల పైబడి అప్పుల పాలు చేసిన గత ప్రభుత్వం

మరో ఉదయం



ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి పునాదులు వేసిన దివంగత ప్రధానులు ఇందిరా, రాజీవ్ గాంధీరాష్ట్ర ప్రజల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తికి ఇందిరమ్మ రాజ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం, షాబాద్ మండలం, చందన వెల్లి గ్రామంలో జున్నా సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి ప్లాంటును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. స్టింగర్ మిషన్ యూనిట్ ను ప్రారంభించిన అనంతరం సోలార్ పవర్ ప్యానెల్ ఉత్పత్తి విధానం గురించి అక్కడ ఉన్న ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ప్యానెల్ ఉత్పత్తికి సంబంధించి గ్లాస్ లోడింగ్, భస్సింగ్, లే అప్, ల్యామినేటింగ్ ఫ్రేమింగ్, క్యూరింగ్ లైన్, క్లీనింగ్ సెక్షన్, సన్ సిమ్ లెటర్, ఐ పోర్టు, ఫైనల్ ఈ.ఎల్ ప్రాసెస్ యూనిట్స్ ను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న మీడియాతో ఆయన మాట్లాడారు. 2030 సంవత్సరం నాటికి ప్రజలకు ఉన్న డిమాండ్ కు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్తు ను ఉత్పత్తిని చేస్తామన్నారు. ప్రపంచంలో మానవ జాతికి విద్యుత్ శక్తికి మధ్యన విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. విద్యుత్ శక్తి అవసరాల డిమాండ్ రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమంలో ఆ డిమాండ్ కు అనుగుణంగా ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాలిక బద్ధంగా సౌర శక్తి, పవన శక్తి, హైడెల్, చెత్త నుంచి తయారు చేసే విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్తు ఉత్పత్తిని పెంచుతూ ప్రజల అవసరాలు తీర్చుతామని చెప్పారు. విద్యుత్తు రంగంపై గత ప్రభుత్వం 81 వేల కోట్ల రూపాయల పైబడి అప్పుల భారం మోపిందన్నారు. ఈ అప్పుల భారాన్ని అధిగమించి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇప్పుడున్న థర్మల్ విద్యుత్తు కు ప్రత్యామ్నాయ మార్గాలతో అధిక విద్యుత్తు ఉత్పత్తిని పెంచుతామన్నారు. ప్రత్యామ్నాయ విద్యుత్తు ను దేశం ప్రజలకు అందించేందుకు దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ వేసిన పునాదులు దేశవ్యాప్తంగా ప్రజల అవసరాలు తీర్చుతున్నాయని వివరించారు. భవిష్యత్తు ప్రజల అవసరాలను తీర్చే విధంగా స్థాపించిన ఈ కంపెనీ వృద్ధి చెందాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ నిర్వాహకులు జున్న శేఖర్ రెడ్డి, జున్న బస్వీ రెడ్డి, ఈదుల నరేందర్ రెడ్డి, భీమవరపు అనిల్ కుమార్ రెడ్డి, భీమవరపు దుర్గాప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పామేనా భీమ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

(అల్లంపూర్ మరో ఉదయం న్యూస్)

ఉండవెల్లి మండల పరిధిలోని అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి ఈ ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య%శీ% కోసం ఎందరో గొప్ప మహనీయులు త్యాగాలు చేసి తమ ప్రాణాలనే తృణప్రాయంగా భావించి ,స్వతంత్ర సమరయోదంలో బ్రిటీష్ వారి నుండి భారతదేశాన్ని విముక్తి చేసి చివరగా 1947 ఆగస్టు15 వ తేదీన మన భారతదేశానికి స్వాతంత్రం తీసుకొచ్చారు. స్వాతంత్రం అంటే బ్రిటీష్ వారి కింద బందీలుగా కాకుండా మనకు మనం స్వతంత్రంగా బ్రతుకుతున్నాం అని ఎమ్మెల్యే అన్నారు అయితే స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా మనకు సరైన పాలన విధానం,చట్టాలు,న్యాయలు, రాజ్యాంగాలులేవు. మనం ఎలా బ్రతకలో వేటిని అనుసరించాలో ఎవరితో ఎలా మెలగాలో మనకు ఎలాంటి హక్కులు ఉన్నాయో, తెలియజేసే చట్టాలు కానీ, రాజ్యాంగలు కానీ అప్పటికి ఆమోదం జరగలేదు వారు అన్నారు మనకు స్వాతంత్ర్య%శీ% 1947 15 ఆగస్టులో వచ్చినప్పటికీ మనం ఇంకా బ్రిటీష్ వారి పాలనా విధానాన్నే అనుసరిస్తున్నాం. అయితే ఈ రాచరిక బందీపాలనను అరికట్టాలని భావించిన ఎందరో మహానుభావులు రాజ్యాంగ నిర్మాణానికి దిశగా అడుగులు వేశారు. ఈ గొప్ప మేధావులు కలిసి ప్రపంచం నలుమూలల సందర్శించి దేశ విదేశాలు తిరిగి, విదేశాల రాజ్యాంగాలు ,చట్టాలు పరిశీలించి అందులోంచి కొన్ని మంచి అంశాలు పరిగణలోకి మన భారత రాజ్యాంగాన్ని లిఖిత పూర్వక%శీ%గా రచించారు. మన భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ రాజ్యాంగాన్ని రచించడంలో డా. బి ఆర్ అంబేద్కర్ గారు కీలక పాత్ర పోషించారు.డా బీ ఆర్ అంబేద్కర్ కి ముసాయిదా కమిటీని అప్పగించారు. ఈ లిఖితపూర్వక రాజ్యాంగాన్ని పూర్తి చేయడానికి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. అయితే1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ సభ ఆమోదించినప్పటికి1950 జనవరి26 వ తేదీన ఉదయం10 గం,18ని, నుండి395



అధికరణలు,22 భాగాలు,9 షెడ్యూళ్లుగా భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. భారత రాజ్యాంగాన్ని పూర్తి చేయడానికి సుమారుగా 64 లక్షల రూపాయలు ఖర్చు అయ్యింది.భారత రాజ్యాంగం ప్రపంచంలోకెళ్ల అత్యంత పెద్దది, మరియు దీనికి చేత్తో రచించడం జరిగింది. భారత దేశాన్ని సర్వసత్తాక లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య, స్వతంత్ర,సాంఘిక, సంక్షేమ, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, సమానత్వాన్ని, చేకూర్చడానికి జాతీయా సమైక్యతను, సమగ్రతను సంరక్షిస్తూ సౌభ్రాతుత్వాన్ని పెంపొందించుటకు వీలుగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారు అని అన్నారుఈ కార్యక్రమంలో అలంపూర్ బీ ఆర్ ఎస్ యువజన నాయకులు అర్. కిషోర్, గజేంద్ర రెడ్డి, జోగులాంబ దేవి ఆలయ మాజీ చైర్మన్ రవి ప్రకాష్ గౌడ్, ఉండవల్లి వైస్ ఎంపీపీ శేసన్న, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు

# చట్టంతో ఉచిత పథకాలకు చెక్

## కేంద్రప్రభుత్వమే చొరవ తీసుకోవాలి

## రాజకీయ నిపుణులు, మేధావుల అభిప్రాయం

న్యూఢిల్లీ,జనవరి26(మరో ఉదయం):

రాజకీయ పార్టీలు అధికారం కోసం లేదా..అధికారం కాపాడుకోవడానికి ప్రకటించే ఉచిత పథకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని కొత్త చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని నిపుణులు, ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. కేంద్రంలోని ప్రభుత్వం కూడా ఉచిత పథకాలను సమీక్షించి చట్టం చేయకుంటే దేశం దివాళా తీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఉచిత పథకాలను ఇలాగే కొనసాగిస్తే కొంపముంచుతాయని హెచ్చరిస్తున్నారు .బ్యాంకులను ముంచి పారిపోయిన నీరవ్ మోడీ, విజయ్ మాల్యాల లాగే వ్యవహరిస్తే బ్యాంకుల దివాళా లాగా దేశం కూడా దివాళా తీస్తుందని అంటున్నారు. ముఖ్యంగా పథకాలకు పరిమితులు విధిస్తూ నిబంధనలు పెట్టాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అనుత్పాదక వ్యయాలు కాకుండా.. ఉత్పాదక వ్యయాల విషయంలోనే పథకాలను అమలు చేస్తే బాగుంటుందని అంటున్నారు. ఇకపోతే పనిదినాలు కల్పించాలని చేపట్టిన ఉపాధిహామీ పథకం కూడా దివాళా పథకంగా మారింది. వేలకోట్లు ఖర్చు చేస్తున్నా సమగ్రంగా పనులు జరగడం లేదు. తెలుగు రాష్ట్రాల తో పాటు ఢిల్లీ, పంజాబ్, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో అనుత్పాదక పథకాలకు వేల కోట్ల రూపాయలను వెచ్చించాల్సి వస్తుండడంతో మౌలిక సదుపాయాల కల్పన పడకేస్తోంది. అలాగే పథకాలను కొనసాగించేందుకు వేలకోట్లు అప్పులు చేయాల్సి వస్తోంది. ఉచిత టీవీలు, ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు, కుట్టు మిషన్లు ఇలా అనేకానేక వస్తువులు ఇస్తామంటున్న పార్టీలు రేపు ఉచితంగా మద్యం, 10 గ్రాముల బంగారాన్ని పంపిణీ చేస్తామంటూ పథకాలను ప్రవేశపెట్టినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ప్రజలకు ఉచితంగా ఇవ్వద్దని రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదు. కాబట్టి అన్ని పార్టీల ప్రభుత్వాలు ఉచిత పథకాలను జోరుగా అమలు చేస్తున్నాయి. ఇలాంటి వాటిని కేంద్ర ఎన్నికల సంఘం కట్టడి చేయలేదు. అందుకే కేంద్ర ప్రభుత్వమే జోక్యం చేసుకుని కట్టడి చేసేలా ఒక కొత్త చట్టాన్ని అమల్లోకి తేవాల్సిన అసవరం ఏర్పడిందని మేధావులు సూచిస్తున్నారు. విద్య, వైద్యం వంటి పేదల సంక్షేమానికి సంబంధించిన రంగాల్లో ఉచితాల అసవరం ఉంది. వీటికి డబ్బులు వెచ్చించాల్సిందే. ఉచిత పథకాలకు పరిమితులు ఉండాలని రాజకీయ నిపుణులు సైతం సూచిస్తున్నారు. పన్నుల ద్వారా ప్రజల నుంచి వసూల్లు చేసిన డబ్బును ఉచిత పథకాలకు కేటాయిస్తూ.. మౌలిక సదుపాయాలకు రాష్ట్రాలు అప్పులు చేస్తున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పు కోసం కేంద్రాన్ని దేబిరిస్తున్నాయి. ఉచిత పథకాలకు నిధులను ధారపోయకుండా ఇలాంటి మౌలిక సదుపాయాలకు వెచ్చిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు.

# సినిమా వార్తలు

## అక్కినేని తరవాత చిరంజీవికే ఆ గౌరవం

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని దేశంలో రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ వరించింది. ఈ పురస్కారం చిరంజీవి స్వయంకృషికి తగ్గ ప్రతిఫలంగా సినీ ప్రియులు, అభిమానులు కొనియాడుతున్నారు. అయితే ఇన్నేళ్ల తెలుగు సినీ చరిత్రలో పద్మ విభూషణ్ పురస్కారం ఇద్దరకి మాత్రమే దక్కింది. తొలుత 2011లో నట దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావుకు దక్కింది. టాలీవుడ్‌లో తన పేరును శాశ్వతంగా లిఖించుకున్న మహోన్నత వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు. ఆయనకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, పద్మ విభూషణ్, పద్మశ్రీ, కలైమామణి, రఘుపతి వెంకయ్య అవార్డు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి కాళిదాసు లాంటి ఎన్నో పేరొందిన అవార్డులు అందుకున్నారు. తాజాగా ఆ ఘనత మెగాస్టార్ చిరంజీవికి మాత్రమే దక్కింది. తెలుగు సినీ రంగంలో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత ఆ ఘనత దక్కించుకున్న నటుడిగా చిరంజీవి నిలిచారు. దక్షిణాదికి చెందిన కళారంగంలో తమిళనాట ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం(2021), ఇళయరాజా (2018), కె.జె.ఏసుదాసు(2017), రజనీకాంత (2016) వంటి ఉద్దండులకు పద్మ విభూషణ్ వరించింది. తెలుగు ఇండస్ట్రీలో మాత్రం ఈ పురస్కార ఘనత అక్కినేని నాగేశ్వరరావు, ఆ తర్వాత చిరంజీవికే దక్కింది.



## మార్చి 29న డేట్ ఫిక్స్ చేసిన టిల్లు స్క్వేర్



సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా వస్తున్న 'టిల్లు స్క్వేర్' సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ సినిమా ఇప్పటికి రెండు మూడు తేదీలను ప్రకటించి వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పుడు ఎట్టకేలకు ఒక కొత్త తేదీని అంటే మార్చి 29న విడుదలవుతోందని చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. మళ్ళీ మార్పులు లేకుండా ఇదే తేదీని ఖరారు చేస్తారని అనుకుంటున్నారు. ఇంతకు ముందు సిద్ధు నటించిన 'డీజే టిల్లు' కి ఈ సినిమా సీక్వెల్ గా వస్తోంది. అయితే మొదటి దానిలో నేహా శెట్టి కథానాయిక కాగా, ఈ 'టిల్లు స్క్వేర్' లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి కూడా. ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్ 'కిల్లర్' లుక్స్ ఇప్పటికే బాగా పాపులర్ అయ్యాయి. మార్చి 29 అనగానే అప్పటికి వేసవి సెలవులు మొదలవుతాయి కాబట్టి ఈ సినిమాకి అది మంచి విడుదల తేదీగా చిత్ర నిర్వాహకులు భావించవచ్చు అని అంటున్నారు. కానీ ఆ సమయంలో పార్లమెంటుకి, ఆంధ్రాలో అసెంబ్లీ కి ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంటే మాత్రం అప్పుడు ఈ సినిమా విడుదల తేదీలో మార్పులు ఏమైనా ఉండొచ్చేమో అని కూడా అంటున్నారు. ఈ సినిమాకి మల్లిక్ రామ్ దర్శకుడు, సూర్యదేవర నాగ వంశీ నిర్మాత. ఈ సినిమాకి ప్రముఖ గాయకుడు రామ్ మిరియాల సంగీతాన్ని అందించటమే కాకుండా అతను పాడిన పాటలు 'టిక్కెట్టే కొనకుండా', 'రాధిక' పాటలు బాగా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించి గత సంవత్సరం నుండి వార్తల్లో వుంది, విడుదల తేదీలు, ప్రచార చిత్రాలతో, ఎట్టకేలకి ఇప్పుడు ఒక విడుదల తేదీ ఖరారు చేశారు.



## క్యూరియాసిటీ పెంచుతున్న సూర్య కంగువ

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య టైటిల్ రోల్‌లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు నెట్టింట క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. మేకర్స్ ఇటీవలే పొంగళ్ శుభాకాంక్షలు తెలియజేస్తూ షేర్ చేసిన కొత్త లుక్‌లో సూర్య చేతికి టాటూస్ కనిపిస్తున్నాయి. సూర్య మరోవైపు సెకండ్ లుక్‌లో ఓ వైపు వారియర్‌గా కత్తి పట్టుకుని కనిపిస్తుండగా.. ఇంకోవైపు స్టైలిష్ లుక్‌లో మ్యాజిక్ చేస్తున్నట్టుగా మెస్మరైజ్ చేస్తున్నాడు. కంగువలో దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. బాబీడియోల్ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. తాజాగా అదిరిపోయే అప్‌డేట్ అందించారు. కంగువలో కీ రోల్ జటరతిసజీనిను పరిచయం చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. సూర్య కెరీర్‌లో బ్లాక్ బస్టర్ ఆల్బమ్స్ అందించిన రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ కంగువ చిత్రానికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తున్నాడు. కంగువ గతానికి, ప్రస్తుతకాలానికి మధ్య ఉండే కనెక్షన్‌తో సాగే స్టోరీలైన్ ఆధారంగా కంగువ తెరకెక్కుతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సూర్య మరోవైపు సుధా కొంగర డైరెక్షన్‌లో సూర్య 43లో కూడా నటిస్తున్నాడని తెలిసిందే.

## గుంటూరు కారం నుంచి అమ్మ పాట విడుదల




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'గుంటూరు కారం' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజే ఈ సినిమాకు కొంచెం మిక్స్‌డ్ టాక్ రావడంలో కలెక్షన్ల మీద ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాలు భావించాయి. కానీ ఆ అంచనాలను తలకిందులు చేస్తూ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుని పోతుంది. అయితే ఈ సినిమాలోని సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ధమ్ మసాలా, కుర్చీ మడత పెట్టి, ఓహ్ మై బేబీ, సాంగ్ లు విడుదల చేయగా.. చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ 'అమ్మ' అనే ఎమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. పసి వాడయై వేచి చూస్తుందా బదులే రాని గతం. పగ వాడయై నింద మోస్తుందా ఎదుటే ఉన్న నిజం అంటూ సాగిన ఈ పాట హృదయాలను హత్తుకునేలా ఉంది. ఇక ఈ పాటకు 'సరస్వతీ పుత్ర' రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా.. విశాల్ మిశ్రా పాడాడు. థమన్ సంగీతం అందించాడు.

Edited,printed,published and Owned by sredharPrinted at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com